మీమేలు కోసం కడదాకా నిలబడతా





నియోజక వర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పని చేశాను. 'గడప గడపకూ మన ప్రభుత్వం' అనే బృహత్తర కార్యక్రమం ద్వారా ప్రతి గడపకూ వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశాను. ప్రజలు మరోసారి అవకాశం ఇస్తే పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని సిట్టింగ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ 'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రస్తావించారు.

–డాబాగార్డెన్స్

- నేను స్థానికుడిని.. మీలో ఒకడిని
- నియోజకవర్గాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతా..
- దీర్ఘకాలిక సమస్యలన్నీ పరిష్కరించాం
- నిరంతరం ప్రజలతో మేమకమై ఉన్నా
- సంక్షేమాభివృద్ధి.. జగన్ సుపరిపాలనే గెలిపిస్తాయి
- 'దక్షిణ'లో పార్టీ జెండా ఎగరడం ఖాయం
- వైఎస్సార్‌సీపీ

ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

సాక్షి ఇంటర్వ్యూ

ఎమ్మెల్యేగా పని చేసిన మీరు నియోజకవర్గాన్ని ఏ మేరకు అభివృద్ధి చేశారు? మీరు ఎన్నికైతే ఏం చేస్తారు?

ఐదేళ్ల పాటు నియోజకవర్గాన్ని గణనీయంగా అభివృద్ధి బాట పట్టించాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, జీవీఎంసీ సహకారంతో నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టాను. పాతనగరానికి కొత్త లుక్ తీసుకొచ్చా. రూ.600 కోట్లతో అండర్ గ్రౌండ్ కేబులింగ్, రూ.500 కోట్లతో కింగ్ జార్జి ఆస్పత్రి, ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆస్పత్రిని కార్పొరేట్ తరహాలో ఆధునీకీకరించాం. రూ.250 కోట్లతో నియోజకవర్గంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు చేశాం. రూ.100 కోట్ల వ్యయంతో జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రాణీబొమ్మ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ, విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి 1:4 నిష్పత్తిలో టీడీఆర్‌లు అందజేశాం.

మీ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరు ఎలా ఉంది?

రూ. 20 కోట్లతో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా 13 పాఠశాలలను ఆధునికీకరించాం.

ప్రజల ఆరోగ్య విషయంలో మీరు.. మీ ప్రభుత్వం చేపట్టిన చర్యలేంటి?

రూ.10 కోట్లతో నియోజకవర్గ పరిధిలో 4 వైఎస్సార్ అర్బన్ క్లినిక్స్ ఏర్పాటు చేశాం.

సత్యదేవుని ఆలయ అభివృద్ధిపై మీ స్పందన?

రూ.11 కోట్లతో ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సత్యనారాయణస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశాం. పూర్ణామార్కెట్ నుంచి కొండపైకి ఘాట్ రోడ్డు పనులు దాదాపు పూర్తి కావచ్చాయి.

పోర్టు కాలుష్య సమస్యపై మీ అభిప్రాయం?

నేను ఎమ్మెల్యే అయితే పోర్టు కాలుష్య సమస్యను పరిష్కరిస్తానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చాను. ఎమ్మెల్యే అయిన వెంటనే దీనిపై యుద్ధం ప్రకటించాను. అలుపెరగని పోరాటం చేశాను. నిరంతరం పోర్టు యంత్రాంగంతో జరిపిన చర్చలు, శ్రమ ఫలితంగా పోర్టు పొల్యూషన్‌కు చెక్ పెట్టాను. కాలుష్య నివారణలో భాగంగా ప్రతిరోజూ వాటరింగ్ చేయించేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. బొగ్గు ప్రబలకుండా టార్పాన్స్ వేయించాను. పర్యావరణం కోసం లక్షలాది మొక్కలు పోర్టు పరిసర ప్రాంతాల్లో నాటించాను. గాలిలో పొల్యూషన్ శాతం పెరిగితే తెలిసేలా మూడు పొల్యూషన్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేయించాను. దీంతో పోర్టు పొల్యూషన్‌కు కొంత మేర చెక్ పడింది.

నియోజకవర్గంలో సామాజిక భవనాలు, దోబీ ఖానాల పరిస్థితి ఏంటి?

నియోజకవర్గం పరిధి వివిధ వార్డుల్లో అనేక కమ్యూనిటీ హాల్స్ అందుబాటులోకి తీసుకువచ్చా. ప్రజాదర్బార్‌లో కుల సంఘాల పెద్దల వినతి మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూతన కమ్యూనిటీ హాళ్లు నిర్మించాం. 38వ వార్డు బుక్కావీధిలో విశ్వబ్రాహ్మణుల కోసం కమ్యూనిటీ హాల్ కేటాయించడమే కాక మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయించాను. 39వ వార్డు చిలకపేటలో నాయీబ్రాహ్మణుల కోసం, పాత పోస్టాఫీస్ జంక్షన్‌లో జాలరి కమ్యూనిటీకి, 30వ వార్డు అఫీషియల్ కాలనీలో వాడబలిజల కోసం, 34వ వార్డు కొబ్బరితోట, 31వ వార్డు గొల్లల పాలెంలో ఆర్టీ క్లబ్ శ్లాబ్ నిర్మాణం, 36వ వార్డు ఏవీఎన్ కళాశాల సమీపాన రెల్లికుల సంఘానికి, కాన్వెంట్ జంక్షన్ ఏరియాలో గౌడ, క్రిస్టియన్ సంఘాలకు, విశాఖ ఏసీ మెకానిక్ అసోసియేషన్, విశాఖ ద్విచక్ర వాహన మెకానిక్ అసోసియేషన్‌కు విరివిగా కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేశాం. రజక కులానికి ఉపయోగపడే దోబీఖానాలు 31వార్డు కనకలవీధి, 34వ వార్డు కొబ్బరితోట, 30వ వార్డు రజక వీధిలో అభివృద్ధి చేశాం.

ఎస్‌ఎల్ కెనాల్ వల్ల ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎటువంటి చర్యలు చేపట్టనున్నారు?

పోర్టు పనులు జరగడం వల్ల ఫెర్రీ రోడ్డు ఎస్‌ఎల్ కెనాల్ 11 గేట్లు మూసివేస్తున్నారు. కేవలం ఒక్క గేటు మాత్రమే తెరిచి ఉంచడం అవుతోంది. దీంతో మురుగు కాలువలు పొంగి దోమలు ప్రబలుతున్నాయి. ఈ కారణంగా 39వ వార్డులో ఇబ్బందులు పడుతున్న స్థానికుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాను. పోర్టు చైర్మన్‌తో మాట్లాడి కెనాల్ నుంచి 12 గేట్ల ద్వారా దక్షిణ నియోజకవర్గంలో ఉన్న గెడ్డ వాగు అంతా సముద్రంలోకి వెళ్లేందుకు వీలుగా కొబ్బరితోట నుంచి ఫెర్రీ రోడ్డు వరకు కెనాల్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాలు తొలగించి, ఫ్రీగా ఫ్లో అయ్యేలా తగు చర్యలు తీసుకుంటాం.

నిరుపేదలకు మీరు చేసే సాయం?

కష్టాల్లో ఉన్నోడిని ఆదుకోవడమే వాసుపల్లి లక్ష్యం. నన్ను నమ్మి ఓట్లేసిన ప్రజల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. ప్రతిరోజూ నేను ఇంటికి వెళ్లిన వెంటనే నా ప్రజలకు ఏం చేశాను. ఏ విధంగా ఉపయోగపడ్డానని ఆలోచిస్తాను. నా ప్రజలకు నేను సాయం చేశానంటే ఆ రోజు ప్రశాంతంగా నిద్రపోతాను. లేదంటే ఆ రోజు ఏదో వెలితి వెంటాడుతుంది. గత ఐదేళ్లలో వేలాది మంది నిరుపేదలు.. కష్టాల్లో ఉన్న వారికి నా సొంత నిధుల నుంచి రూ.3 కోట్ల వరకు ఆర్థిక సాయం చేశాను. అంతేకాక పేద విద్యార్థులకు సొంత కళాశాలలో ఉచిత విద్య అందించాను. ఫీజులు చెల్లించలేని వివిధ స్కూళ్లు, కళాశాలల్లో చదువుతున్న వేలాది మంది పేద విద్యార్థులకు నా సొంత నిధులతో ఫీజులు చెల్లించాను.

ముస్లింలకు మీరేం చేశారు?

వాసుపల్లి: మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న కోటవీధి ప్రాంతంలో పుట్టి పెరిగాను. ముస్లింలన్నా.. వారి మత సాంప్రదాయాలన్నా అమితమైన గౌరవం. రాజకీయంగా నా గెలుపులో ముస్లింల పాత్ర మరచిపోను. ప్రతి శుక్రవారం ముస్లిం ప్రజాదర్బార్ నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తూ వస్తున్నా. రూ.78 లక్షలతో మక్కా మసీదు మొదటి అంతస్తు నిర్మాణం, రూ.78 లక్షలతో కోటవీధి దర్గా, రూ.50 లక్షలతో వన్‌టౌన్ షాదీఖానా మరమ్మతులు, రూ.23 లక్షలతో కోటవీధి దర్గా వంటగది నిర్మాణం జరిగింది.

నియోజకవర్గ ప్రజల నుంచి మీరు ఆశించేది ఏమిటి?

నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను. ఇంకా చేయాల్సి ఉంది. చేస్తాను కూడా. నిరుపేదల కష్టాలు తీరాలంటే.. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, నియోజకవర్గ ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్ అనే నన్ను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించండి.

రాష్ట్రంలో 'గడప గడపకు' ముందుగా పూర్తి చేసింది నేనే

గడప గడపకు కార్యక్రమ నిర్వహణలో రాష్ట్రంలో ఉన్న 175 స్థానాలకు గాను దక్షిణం నుంచి ముందుగా ఆ కార్యక్రమాన్ని పూర్తి చేసింది నేనే. అలాగే నియోజకవర్గంలోని ప్రతి వార్డు, ప్రతి ప్రాంతాన్ని వందల సార్లు సందర్శించాను. నియోజకవర్గంలో పేరు పెట్టి కాకుండా అక్కా, అన్నా, తమ్ముడు అని పిలుచుకునే అనుబంధం ఉంది. దాంతో స్థానికులు తమ సమస్యలు నాకు చెప్పగలరు.

సీఎం జగన్ స్ఫూర్తితో..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఎంత కష్టమైనా పడేందుకు సిద్ధం. మండుటెండలో కూడా జగనన్న రాష్ట్రమంతా తిరిగారు. ప్రజలను కలుసుకున్నారు. ఎక్కడా ఏనాడూ ఆయన అలిసిపోయింది లేదు. చివరికి ఆయనపై దాడి జరిగినప్పుడు కూడా ఆయన ధైర్యం కోల్పోలేదు. అదే స్ఫూర్తితో నేను కూడా నియోజకవర్గం అభివృద్ధికి రాజీ లేకుండా కష్టపడతాను. పేదలకు మేలు చేయడం అనే ఒకే ఒక్క అజెండాతో ముందుకెళ్లే జగనన్న అజెండాయే నాది కూడా..

ఇక్కడి సమస్యలన్నీ తెలుసు..

నేను పక్కా లోకల్.. కోటవీధిలో పెరిగినవాడిని.. ఇక్కడి ప్రజల సమస్యలన్నీ తెలుసు. దాంతో పాటు వారంలో రెండు సార్లు ప్రజాదర్బార్ కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారానికి కృషి చేశాను. దాని వల్ల నా ప్రజల కష్టసుఖాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. వాటిని పరిష్కరించే శక్తిసామర్థ్యాలు ఉన్నాయి.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన



ఉచిత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం : బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆవరణలో శుక్రవారం ఓమ్ని ఆర్కే ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. బంగారుమెట్ట, బంగారుమెట్ట కాలనీ, కుమ్మరవీధి ప్రాంతాల నుంచి సుమారు 150 మంది పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్ వంటి ప్రాథమిక పరీక్షలు చేపట్టిన సిబ్బంది సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ క్యాంపు కో ఆర్డినేటర్ గౌరినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను రక్షించిన బీచ్‌గార్డ్



చిన్నారులను రక్షించిన బీచ్‌గార్డు ధనరాజు

అల్లిపురం : మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి గోకుల్ పార్క్ వద్ద శుక్రవారం సాయంత్రం రెల్లివీధికి చెందిన కె. సాగర్, వి.గణేష్ అనే ఇద్దరు బాలురు స్నానానికి దిగారు. అయితే అలల తాకిడికి వారు సముద్రంలో కొట్టుకుపోతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న బీచ్ గార్డ్ ఎం.ధనరాజు గమనించి వారిని రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చాడు. పోలీసులకు సమాచారం అందించి వారు వచ్చాక చిన్నారులను అప్పగించారు. పిల్లలిద్దరికి ప్రాణాపాయం తప్పటంతో వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎంవీపీ గ్రంథాలయానికి ఫర్నిచర్ వితరణ

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ గ్రంథాలయానికి కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఫర్నిచర్ అందజేశారు. యూనియన్ 74వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా లైబ్రరీకి ఐరన్ బీరువాతో పాటు 15 ఫైబర్ కుర్చీలు పంపిణీ చేశారు. శుక్రవారం ఎంవీపీ కాలనీ సెక్టార్–7లోని లైబ్రరీలో యూనియన్ నాయకులు ఈ ఫర్నిచర్‌ను లైబ్రేరియన్ ఉమామహేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మహేంద్ర, శ్రీనివాసరావు, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి యోగా శిబిరం

ఏయూ క్యాంపస్: రుషిగాయత్రి యోగా కేంద్రం ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలో 14 రోజుల ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం నిర్వాహకుడు ఆచార్య జి.అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరం ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9440395439, 7780154103 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చిన్మయానంద జయంతి రేపు

ఉక్కునగరం: చిన్మయ మిషన్ ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం చిన్మయానంద జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. చిన్మయానంద 108వ జయంతి సందర్భంగా 'చిన్మయ శంకరం' పేరిట ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చిన్మయ మిషన్ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు కూర్మన్నపాలెం అన్నపూర్ణ థియేటర్ సమీప శ్రీకృష్ణ ఈడెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న కార్యక్రమంలో పాదుకా పూజ, భజనలు, కోలాటం ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

బల్లిగిరి వెంకన్న కల్యాణోత్సవ రాట మహోత్సవం

19న వార్షిక తిరుకల్యాణోత్సవం



శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి



రాట మహోత్సవంలో పాల్గొన్న ఈవో రమాబాయి, మహిళలు

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణోత్సవానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ నెల 19వ తేదీ వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున జరిగే కల్యాణోత్సవానికి రాట మహోత్సవం వైభవంగా చేపట్టారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం సందర్భంగా మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాట మహోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో జీవీ రమాబాయి మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన అంకురార్పణ, ఉత్సవ సంకల్పం జరుగుతాయన్నారు. 23న వసంతోత్సవం, చక్రతీర్థం, 24న శ్రీ పుష్పాంజలి ఉత్సవం, శ్రీవారి ఊంజలసేవ, పవళింపు సేవలు ఉంటాయన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఎలక్ట్రిక్ బస్సు వచ్చింది



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఎలక్ట్రిక్ బస్సు కొనుగోలు చేసింది. ఈ మేరకు బస్సు శుక్రవారం దేవస్థానానికి వచ్చింది. సింహగిరి ఘాట్‌రోడ్డులో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టాలని గత ట్రస్ట్‌బోర్డు ఆమోదం తెలపడంతో సుమారు రెండు కోట్లు వెచ్చించి ఎలక్ట్రిక్ బస్సు కొనుగోలు చేశారు. త్వరలోనే బస్సు సేవలు అందుబాటులోకి తేనున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రసన్న వేంకటేశ్వరాలయంలో ఘనంగా చందనోత్సవం



అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని ప్రసన్న వేంకటేశ్వరుడిని ప్రత్యేకంగా చందనంతో అలంకరించారు. చందన అలంకరణలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరుడిని మూడు రోజుల పాటు భక్తుల దర్శనార్థం ఉంచనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు పలువురు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్‌లో..

షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అక్షయ తృతీయను పురస్కరించుకొని శుక్రవారం పద్మావతి అమ్మవారిని, తిరుమల బాలాజీని చందనంతో, తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ముగిసిన రైల్వే డివిజన్ స్పోర్ట్స్ ఫెస్టివల్



విజేత జట్లతో రైల్వే అధికారులు

విశాఖ స్పోర్ట్స్ : ఈకోర్టా వాల్తేర్‌లోని అంతర్ డివిజన్ల స్పోర్ట్స్ ఫెస్టివల్ శుక్రవారంతో ముగిసింది. నెల రోజుల పాటు పదమూడు క్రీడాంశాల్లో మెన్ క్యాటగిరీలో పోటీలు నిర్వహించగా ఎనిమిది క్రీడాంశాల్లో వుమెన్ జట్లు పోటీ పడ్డాయి. సివిల్ ఇంజినీరింగ్ జట్టు 42 పాయింట్లతో ఓవరాల్ ప్రదర్శన చేసింది. ఎలక్ట్రికల్ (ఆపరేషన్స్) జట్టు చక్కటి ప్రదర్శనతో ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ఏడీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ట్రోఫీలందించారు. మెన్ ఫుట్‌బాల్‌లో ఆపరేషన్స్ జట్టు విజేతగా నిలువగా క్రికెట్‌లో ఆర్పీఎఫ్ జట్టు, టెన్నిస్‌లో కమర్షియల్ జట్టు, బాల్ బ్యాడ్మింటన్‌లో ఎలక్ట్రికల్ ఆపరేషన్స్ జట్టు, బాడీ బిల్డింగ్‌లో సీడబ్ల్యు జట్టు విజేతగా నిలిచాయి. బాడీ బిల్డింగ్‌లో పునీల్, బాల శంకర్ చక్కటి ప్రదర్శన కనబరిచారు. వెయిట్ లిఫ్టింగ్ మెన్‌లో సీడబ్ల్యు సివిల్ జట్టు, ఇంజినీరింగ్ వుమెన్ జట్టు విజేతలుగా నిలిచాయి. టీటీలో కమర్షియల్ జట్లు విజేతలుగా నిలిచాయి. చెస్‌లో కమర్షియల్, మెడికల్ జట్లు విజేతలుగా నిలిచాయి. క్యారమ్స్‌లో ఎలక్ట్రికల్ లోకో షెడ్, సివిల్ ఇంజనీరింగ్ జట్లు విజేతలుగా నిలిచాయి. కబడ్డీ మెన్‌లో ఎలక్ట్రికల్ ఆపరేషన్స్, వుమెన్‌లో సీడబ్ల్యు జట్లు విజేతలుగా నిలిచాయి. అథ్లెటిక్స్‌లో ఆర్పీఎఫ్, ఎలక్ట్రికల్ ఆపరేషన్స్ జట్లు, వాలీబాల్‌లో సివిల్ ఇంజనీరింగ్, ఆర్పీఎఫ్ జట్లు విజేతలుగా నిలిచాయి.

ఉచిత మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు



ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్న ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థులు

అల్లిపురం : సింహాచలం చందనోత్సవం సందర్భంగా వెంకటేశ్వరమెట్ట శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. సూరిశెట్టి శంకర్రావు, లక్ష్మీ దంపతుల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బుద్ధ గోపి, సరగడం భాస్కర్, సూరిశెట్టి వేణు, శరగడం మోహన్, ఈశ్వరరావు, బుద్ధ చిన్న, బీశెట్టి శ్రీను తదితరులు పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు.

సింహాచలేశుని సేవలో ఏవీఎన్ పూర్వ విద్యార్థులు..

డాబాగార్డెన్స్ : శ్రీవరహాలక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థులు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకురాలు లలితకుమారి నేతృత్వంలో నిర్వహించిన సేవలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి విన్నపం

డాబాగార్డెన్స్ : విశాఖ పార్లమెంట్‌కు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను బ్యాలెట్ నంబరు 28, ప్రెషర్‌కుక్కర్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని లగుడు గోవిందరావు ఓటర్లను అభ్యర్థించారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమైక్యాంధ్రపై ఉద్యమం చేపట్టానని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని పోరాటాలు చేశానన్నారు. సమావేశంలో పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, బర్ల పైడం నాయుడు, ఎన్. శివకుమార్, గులిపల్లి గజేంద్రనాయుడు, పెదిరెడ్ల శ్రీనివాసరావు, గొల్లు శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షయ తృతీయ వేడుకలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో అక్షయ తృతీయ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు శ్రీమహలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. యంత్ర మహామేరు ప్రాంగణం ఈశాన్య దిక్కులో కొలువైన మహలక్ష్మి అమ్మవారికి శ్రీసూక్త విధానంలో షోడశోపచార పూజ చేసి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.అమ్మవారి ఉత్సవ మూర్తికి భక్తులు క్షీరాభిషేకం చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాలబాలికలు వేదమంత్రాలు పఠించారు. మహాలక్ష్మి హోమం జరిపించారు. గురుమాత అన్నపూర్ణమ్మ చేతులమీదుగా అన్నసమారాధన నిర్వహించారు.

బాలుడి ప్రాణం కాపాడిన కేజీహెచ్ వైద్యులు

- పూర్తిగా కోలుకుని డిశ్చార్జి అయిన బాలుడు



కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న బాలుడు దిలీప్‌కుమార్ (ఫైల్)



కోలుకున్న దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి

మహారాణిపేట : తీవ్ర అనారోగ్యంతో కేజీహెచ్ పిల్లల వార్డులో చేరిన పది సంవత్సరాల బాలుడికి చక్కటి చికిత్స అందించిన వైద్యులు శుక్రవారం అతన్ని డిశ్చార్జి చేశారు. ఏప్రిల్ 10న విజయనగరానికి చెందిన దిలీప్ కుమార్ (10) తీవ్ర జ్వరం, కడుపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి పలు సమస్యలతో నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అనంతరం అతన్ని మరింత మెరుగైన ఆరోగ్యం కోసం అక్కడి నుంచి కేజీహెచ్ పిల్లల వార్డుకు తరలించారు. కేజీహెచ్ పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బీవీ చక్రవర్తి ఆధ్వర్యంలో దిలీప్ కుమార్‌కు వైద్య సేవలు అందించారు. ఇటీవల కేజీహెచ్ పిల్లల వార్డులో ఆధునికీకరించిన పీఐసీయూలో బాలుడికి వైద్య సేవలందాయి. ఆధునికీకరణలో భాగంగా ఈ యూనిట్‌కు 6 వెంటిలేటర్లు, 3 హెచ్ఎఫ్ఎన్‌సీలు, 10 సెంట్రల్ ఎయిర్ కంప్రెషర్లు, 10 పడకలు ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఇటువంటి సౌకర్యాల వల్ల చక్కటి వైద్య సేవలంది బాలుడు బతికి బయట పడ్డాడు. ఈ బాలుడితో పాటు వార్డులో చందన శ్రీ,ఆకాంక్ష రాజు, నాయక్, పెంటమ్మ తదితర చిన్నారులు కోలుకుంటున్నారు. అనారోగ్యానికి గురైన పిల్లలకు చక్కటి వైద్య సేవలు అందించగలుగుతున్నామని, ఈ పరికరాల వల్ల ఆరోగ్యంగా చిన్నారులు ఇంటికి చేరుకుంటున్నారని పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు.

జర్ర అప్పారావుకు చందు పురస్కారం



ఆచార్య జర్ర అప్పారావు

సీతంపేట: ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్టు ప్రతి ఏటా ఇస్తున్న సాహిత్య సేవా పురస్కారం 2024 సంవత్సరానికి ఏయూ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావుకు అందజేయాలని నిర్ణయించినట్టు ట్రస్టు కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు సాహిత్యం, సంస్కృతికి పట్టుకొమ్మగా విలసిల్లుతున్న ఏయూ తెలుగు శాఖ వికాసానికి జర్ర అప్పారావు చేసిన కృషిని గుర్తించి ఈ నెల 18న విశాఖ పౌర గ్రంథాలయంలో పురస్కారం ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.